
# స్టేషన్ బెంచ్

## ప్రతాప రవిశంకర్




మళ్ళీ నా అన్వేషణ మొదలయింది.

ఆమె కథను నాకు ఎవరు చెప్పగలరు? మామూలుగానే విజయవాడ రైలు స్టేషనులోకి ప్రవేశించి. ఆరవ నెంబరు ప్లాట్టు ఫారమ్ మీదికి వచ్చి ఆత్రంగా చూసిన నాకు ఆమె హిగిన్ బాథమ్స్ పక్కన ఉన్న బెంచీ మీద పడుకుని కనిపించింది. ఆమె కళ్ళు మూసుకుని ఉన్నాయి. తల కింద అదే గుడ్డల మూట ఉంది. నడుము పక్కనే జిప్ వూడిపోయిన నల్లని హేండ్ బాగ్ తెరుచుకుని ఉంది. ఆమె ఒక చెయ్యి గుండెల మీదగా ఆ హేండ్ బాగ్‌ను పట్టుకుని ఉంది. బెంచీ కింద నల్లని తోలు చెప్పులు అరిగి పోయి ఉన్నాయి. మామూలు దృశ్యమే.

ఆమెనే చూస్తూ నిలబడి పోయాను.

ఇంతలోనే "ఏమోయ్! ఇంకా అక్కడే ఉందా?" అంటూ వచ్చాడు నారాయణమూర్తి. ఉన్నదన్నట్టు తల వూగించాను. అతనూ నా పక్కకు వచ్చి ఆమెను చూసి "ఇక వారం రోజుల కంటే బతకదు" అన్నాడు చిన్నగా.

ఉలిక్కి పడ్డాను.

ఆమె ఈ రైల్వే ప్లాటు ఫారమ్ మీద—ఈ బెంచీ మీదనే చచ్చిపోతుందా?

ఒక విధమయిన భయంతో ఆమె కేసి చూశాను. నిశ్చింతగా నిద్ర పోతూంది.

మెల్లగా వీస్తున్న గాలికి ఆమె వెంట్రుకలు చిన్నగా కదులుతున్నాయి.

ఆమెను అలా చూస్తున్న కొద్దీ నాలో ఒక విధమయిన బాధ ఉవ్వెత్తున పొంగింది.

ఎవరామె?

ఆమె ఎవరో నాకు తెలీదు. నా ఒక్కడికే కాదు, ఆ ప్లాట్ ఫారమ్ మీద ఉన్న ఎవ్వరికీ తెలీదనుకుంటాను.

సరిగ్గా పదమూడు రోజుల క్రితం మధ్యాహ్నం ఒకటిన్నర గంటల సమయంలో ఆమెను ఆ బెంచీ మీదనే చూశాను.

అప్పుడు ఆమె రూపం ఇలా లేదు.

ఆమె ఒక మాదిరి లావుగా ఉన్నది. పసుపు పచ్చ రంగు చీర కట్టుకుంది. ఒక సూట్‌కేసు. ఒక హేండ్ బాగ్.

బెంచీ మీద కూర్చుని రైల్లో ఎక్కుతున్న మనుషులను చూస్తూంది. రైలు కదులుతున్నప్పుడు ఆమెను నేను చూడటం నాకు ఇప్పటికీ బాగా గుర్తున్నది.

అప్పటి ఆమె చూపులో నాకు ఎక్కువ దిగులు కనిపించింది. ఆ మరు రోజుకూడా ఒంటి గంట దాటగానే ఆరవ నంబరు ప్లాటు ఫారమ్ మీదకు వచ్చిన నాకు ఆమె అదే బెంచీ మీద అలాగే కూర్చుని కనిపించింది.

## వివాహ ప్రకటన

నెలకు రు. 1400 జీతం, క్లాసు 1 గెజిటెడ్ ఆఫీసరు, ఆస్తి, అందము, 5' 10'' ఎత్తు వున్న 28 సంవత్సరముల రెడ్డి యువకునకు సంపన్న రెడ్డి కుటుంబమునుండి 18సం॥ల నుండి 27సం॥ల వయస్సు, ఎత్తు 5' 2'' లేక ఆ పైన, చదువు, సంస్కారము, అందము, ఆకర్షణ కలిగిన యువతి కావలయును. ఉద్యోగస్తురాలయినచో లెక్చరర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును. వివరములకు: బాక్సు నం. 173, కేరాఫ్ ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, హైదరాబాద్—500029.

ఉచితం ఉచితం !!

## తెల్ల మచ్చలు

మా చికిత్స ప్రారంభించగానే మచ్చల రంగులో మార్పు వస్తుంది. పరీక్షించు మా మందు ఎంత పని చేస్తుందో చూడండి. కోరి వివరాలు వ్రాసి ఉచితంగా ఒక ప్యాకెట్టు మందు పొందండి.

**LALIT AYURVEDIC PHARMACY (AW)**
**P.O KATRI SARAI (GAYA)**

దీర్ఘ వ్యాధులకు ఉత్తమ సిద్ధవైద్యం!



నరముల బలహీనత
ధాతుపుష్టి యవ్వనశక్తి
హెర్నియా చర్మవ్యాధులకు
పోస్టు ద్వారా కూడా కలదు
వరిబీజం (బుడ్డ)
మూత్రవ్యాధులకు
ఆపరేషన్ లేకుండా రండి

డా॥ దేవర, ఫోన్: 551, మార్కెట్ సెంటర్ వద్ద, తెనాలి.
బ్రాంచి: 26, నార్త్ బోగ్ రోడ్, మద్రాసు—17

దేహపుష్టికి ఆరోగ్యానికి
పండిత డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
1898 నుండి ప్రసిద్ధి గాంచినది
ఆయుర్వేదాశ్రమం (ప్రైవేట్) లిమిటెడ్ మదరాసు-17.


నాకు ఎంతో ఆశ్చర్య మయింది. ఏమిటీ ఈమె నిన్నటినుంచీ తన వూరు వెళ్ళలేదా?

రైలు తప్పి పోయిందా? అలా తప్పి పోయే అవకాశం లేదు. ఒక వేళ తప్పి పోయినా మరు రోజు ఒంటి గంట వరకూ ప్లాట్ ఫారమ్ మీదనే ఉండాల్సిన అవసరం ఏమున్నది? ఆమె రూపాన్ని చూస్తే క్రితం రోజు నుంచీ ఆమె ఆ ప్లాట్ ఫారమ్ మీదనే ఉన్నట్టుగా తోచింది.

ఆ ప్లాటు ఫారమ్ మీదికి మద్రాసు, హైదరాబాదు, విశాఖపట్నం వైపు వెళ్ళే రైళ్ళు వస్తాయి.

ఇంతకీ ఆమె ఏ వైపుకు వెళ్ళాలి? నాకు తెలేదు. ఆరోజుకూడా హౌరాఎక్స్ప్రెస్ గుంటూరుకు బయలుదేరేవరకూ ఆమెనే చూస్తూ కూర్చున్నాను రైలులో కిటికీ పక్కగా.

నారాయణమూర్తికికూడా ఆమె పట్ల మంచి కుతూహలం కలిగింది. అతనుకూడా నాతోపాటు విజయవాడలో గవర్నమెంటు ఆడిటర్‌గా పని చేస్తున్నాడు.

"ఎవరై ఉంటుంది?" రైలు కదలబోయే ముందు నన్ను అడిగాడు నారాయణమూర్తి.

"ఏమో? అదే తెలీటం లేదు" అన్నాను ఆమెనే చూస్తూ.

నేను చూస్తూండగానే ఆమె లేచి నిలబడింది. చిన్నగా అడుగులు వేస్తూ కుంచెం దూరంలో ఉన్న పంపు దగ్గరకు నడిచింది. నీళ్ళు తాగుతున్న ఒక యువకుడు ఆమె రూపాన్ని చూసి పక్కకు తప్పుకున్నాడు. ఆమె చేతోనే నీళ్ళు తాగింది. పమిట కొంగుతో చేతి తడిని తుడుచుకుంటూ చిన్నగా వచ్చి ఆ బెంచీ మీద కూర్చుంది.

ఒక నిమిషం తరవాత హేండ్ బాగ్ తెరిచి అందులోకి ఒక్క క్షణం చూసి దాన్ని పక్కన పెట్టేసింది.

"పిచ్చిదేమో" అన్నాడు నారాయణమూర్తి ఆమె కదలికలను చూస్తూ.

"కాదనుకుంటాను" అన్నాను. ఎందుకో ఆమె పిచ్చిదనుకుంటే నాకు నమ్మ బుద్ధి కాలేదు. ఆమె కొంచెం చదువుకున్న మనిషి లాగే కనపడింది. మామూలుగానే ఉంది. ఎలాంటి పిచ్చి చేష్టలూ అగుపించ లేదు.

ఆ మరురోజుకూడా ఆమె కనిపించింది.

అదే ప్లాటు ఫారమ్, అదే బెంచీ మీద.

నాకు ఆమె గురించి తెలుసుకోవాలన్న తపన ఎక్కువయింది.

ఆమె ఎవరు? ఎందు కలా ప్లాటుఫారం మీద ఉంటోంది? ఈ ప్రశ్నలకు నాకు జవాబు దొరకలేదు.

ఆరుదవ రోజు మధ్యాహ్నం కూడా ఆమెను ఆ బెంచీ మీదనే చూసిన తర్వాత "ఆమె ఎవరో, ఆమె కథ ఏమిటో అడిగి తెలుసుకుందామా?" అన్నాడు నారాయణమూర్తి.

సరే నన్నాను.

ఇద్దరమూ ఆమె దగ్గరకు వెళ్ళాము.

ఆమె హేండ్ బాగ్‌ను చేతికింద పెట్టుకుని వెనక్కు వాలి పడుకుని ఎదురుగా ఉన్న కొండ మీద తిరుగుతున్న పశువులను నిశితంగా చూస్తూంది.

మాట్లాడకుండా నిలబడ్డాము. నిమిషం తర్వాత ఆమె మా ఇద్దర్నీ చూసింది.

"మీరేమీ అనుకోకపోతే మీ రెవరో, ఏవూరు వెళ్ళాలో చెబుతారా?" అనడిగాను.

ఆమె ఒక్క క్షణం నా కళ్ళలోకి చూసి అదోలా చిన్నగా ఏదో గొణిగింది.

నా కేమీ అర్థం కాలేదు.

"ఆమె అరవం మాట్లాడుతోంది." అన్నాడు నారాయణమూర్తి. నన్ను అంతులేని నిరుత్సాహం ఆవహించింది. ఆమెకు తెలుగు రాదన్న మాట. మా ఇద్దర్లో ఎవరికీ అరవం ఒక్క ముక్క కూడా రాదు.

బొమ్మల్లా ఆమె మొహంలోకి చూస్తూ నిలబడి పోయేము. తర్వాత ఆమె మాట్లాడలేదు. మళ్ళీ తన దృష్టిని కొండల వైపు మళ్ళించింది.

అక్కడనించి కదిలాం.

రైలు దగ్గరకు వస్తూ ఉండగా ఒక పోర్టరు ఎదురు వచ్చాడు. అతన్ని ఆపి ఆమెను చూపించి "ఆమె ఎవరు?" అనడిగాను.

"ఎవరో తెలీదండీ ... ఇంతకుముందు ఒకసారి నాలుగు నెలల క్రితం ఇక్కడకు వచ్చిందండీ తర్వాత మళ్ళీ ఇదే రావటం. ఇక్కడే ఉండిపోయింది. వారం నించీ ఇక్కడి నుంచి కదల్లేదు" అన్నాడు.

"నాలుగు నెల క్రితం ఆమె ఇక్కడకు వచ్చిందా?" ఆశ్చర్యంగా అడిగాను.

"అవునండీ. ఈమె ఒంటరిగా రాలేదు. పక్కనే ఒకాయన ఉన్నాడు. అప్పుడు ఈమె ఇట్లా లేదు. ఖరీదయిన చీర కట్టుకుంది. నవ్వుతూ ఉన్నది."


"ఈమె నీకు అంత బాగా ఎలా గుర్తున్నది?" నారాయణమూర్తి అడిగాడు. అతనికి ఆ పోర్టరు నోటికి వచ్చినట్లు చెబుతున్నాడనే అనుమానం వచ్చింది. నాకు అలాంటి అనుమానం ఏదీ రాలేదు. అబద్ధం చెప్పవలసిన అవసరం వాడికి ఏమున్నది గనుక?

"అప్పుడు ఆమె ఐదు సూట్కేసులతో దిగింది. రైలు దిగటంతోటే నేనే ఆ సూట్కేసు లన్నింటినీ నెత్తి కెత్తుకున్నాను. నడుస్తుండగా ఎవరో ఎదురు నించి తొందర్లో వచ్చి నన్ను గుద్దుకోవడంతో పైనున్న ఒక సూట్కేసు కింద పడిపోయింది. దాంతో అది తెరుచుకుని అందులోనించి కొన్ని మట్టి గాజులు కిందపడి పగిలిపోయాయి. అప్పుడు ఈమె నన్ను చచ్చేట్లు తిట్టింది. నాకూ బాధ అనిపించింది. చివరకు ఆమె నన్ను కాదని మరో కూలీ చేత ఆ సూట్కేసులను బయటకు మోయించుకు వెళ్ళింది. అందువల్లనే ఈమె నాకు బాగా గుర్తు" అన్నాడా పోర్టరు ఆమె వైపు చూస్తూ. వాడు కొంచెం చదువుకున్న వాడులాగానే కనిపించాడు.

వాడు చెప్పినదంతా విని ఆమెను చూస్తే నా గుండె మరింత బరువెక్కింది.

నాలుగు నెలల క్రితం ఆమెతో రైలు దిగిన ఆయనేమయ్యాడు? మరో ప్రశ్న నాలో తల ఎత్తింది.

పోర్టరు వెళ్ళిపోయాడు. వెళ్ళబోయే ముందు "మీరు ఆమెకుఏమయినా ఇవ్వాలనుకుంటున్నారా?" అని అడిగాడు.




"ఏమిటని?" అడిగాను.

"కాఫీగానీ, టిఫిన్‌గానీ."

"ఎందుకు?"

"ఇవ్వద్దు. ఇచ్చినా ఆమె తీసుకోటం లేదు. మేము చాలాసార్లు ప్రయత్నించాం. వద్దంటేవద్దు అన్నది. ఆ కుళాయి నీళ్ళు తాగి బతుకుతోంది" అని వెళ్ళిపోయా డతను.

ఆమె ప్రవర్తన నాకు మరింత ఆశ్చర్యాన్ని కలిగించింది. ఎంత ఆశ్చర్యాన్ని కలిగించినా నాలో ఆమె ఎంత ఉత్సుకతను కలిగించినా ఆమె గురించి ఏమీ తెలుసుకోలేక పోయేను. ఇవాల్టికి ఆమె ఈ ఆరవ నెంబరు ప్లాటుఫారం మీది కొచ్చి పదమూడు రోజు లయింది.

"అతనేదో మాటాడుతున్నాడోయ్ ఆమె ... " అన్నాడు నారాయణమూర్తి ఒకతన్ని ...చూపుతూ.

ఎవరో అతను నల్లగా, సన్నగా ఉన్నాడు. తన పక్కనున్న ఒక నడివయు సాయునతో ఆమెను చూపుతో ఏదో చెబుతున్నాడు.

ఇద్దరం గబగబా అతని దగ్గరకు నడిచాము.

"ఆమె మీకు తెలుసా?" నారాయణమూర్తి అతన్ని అడిగాడు.

"ఆ ... బాగానే తెలుసు."

"ఏ వూరు?"

"మ్రెడాస్ పక్కనే ఉన్న చిన్న టవున్."

"ఎందుకు ఇక్కడ ఉంటోంది ఇన్నాళ్ళనుంచి."

"ఇన్నాళ్ళ నించి ఉంటూందని నాకు ఇప్పుడే ఎవరో చెప్పారు. ఈమె నాలుగు నెలల క్రితమే ఆ వూర్నించి వచ్చేసింది?" అన్నా డతను.

"ఎందుకు" అడిగాను.

"అదంతా ఒక కథ" అన్నాడు.

"ఏమిటి కథ?" కుతూహలంగా అడిగాను. నాకు ప్రాణం లేచి వచ్చినట్టయింది. ఇన్ని రోజులకు నా అన్వేషణ ఫలించింది ఆమె గురించి చెప్పే మనిషి దొరికాడు.

"చెబుతాను" అని ఆమె వైపు చూశా డతను. ఆమె హాండ్ బాంగ్‌ను, చెప్పులను తల క్రింద పెట్టుకుని పడుకుని కళ్ళు మూసుకుంది.

"పాపం ... ఈమె ఇంతకుముందు కూడా ఎన్నో కష్టాలను అనుభవించింది" అంటూ మొదలుపెట్టా డతను.

మేము బాగా కుతూహలం కనబరచటంతో అతను ఆసక్తిగా చెబుతున్నాడు: "ఈమె పేరు అలివేలు. మూడేళ్ళ నుంచీ నాకు తెలుసు. ఈమె మొగుడు ఒక స్కూలు మాస్టరు. ఆయన చాలా క్రూరమయిన మనిషి. మనిషి చూడటానికి చాలా భయంకరంగా ఉంటాడు. అతనికి లేని అలవాట్లు లేవు. బాగా తాగుతాడు. చెడు తిరుగుళ్ళు తిరుగుతాడు రోజూ పీకలవరకూ తాగి వచ్చి అలివేలును చచ్చేటట్టు కొట్టేవాడు. మా అందరికీ ప్రతి రోజూ అలివేలు ఏడుపు వినిపించేది. ఆ రోడ్డులో ఉన్న వాళ్ళందరూ అలివేలు ఏడుపును రాత్రి మొత్తం మీద ఎప్పుడో ఒకప్పుడు వినేవాళ్ళు. చాలా మంది అతను పెట్టే బాధలను చూడలేక వాళ్ళ విషయంలో కలిగించుకొనే వాళ్ళు. కాని అతను వాళ్ళను కూడా బూతులు తిట్టేవాడు అందుకని అందరూ అలివేలు గాద జాలిపడటం తప్పించి ఏమీ చెయ్యలేక పోయారు. ఇలా అలివేలు అనుక్షణం మొగుడి వల్ల నరకం అనుభవిస్తుంది. అతను ఒక్కోరోజు ఆడవాళ్ళను ఇంటికే తీసుకొచ్చేవాడు. ఆ రోజున మరింత ఎక్కువ గొడవ జరిగేది. పలుగురూ చూస్తుండగానే అతను అలివేలును గొడ్డును బాదినట్టు బాది బయటకు గెంటేసేవాడు. పాపం అలివేలు రాత్రల్లా చలికివణికి పోతూ అలా బయటే ఉండిపోయేది. ఎవరయినా పిలిచినా వచ్చేది కాదు.

ఇలాంటి సమయంలోనే ఆరు నెల్ల క్రితం అలివేలు ఇంటి ప్రక్కనే ఉన్న మేడ మీద గదిలో ఒకాయన అద్దెకు దిగాడు. ఆయన ఆంధ్రాప్రాంతం నించి వచ్చాడు. ఆయనతో నాకు పరిచయమయింది. నేనే ఆయన ఆంధ్రా వాడని వెళ్ళి మాట్లాడాను. నేనుకూడా ఆంధ్రా వాడినే. కాకపోతే చాలా ఏళ్ళ క్రితం తమిళనాడులో స్థిరపడిపోయాము. ఆయన ఒక రోజు అలివేలు గురించి అడిగాడు. నాకు తెలిసిందంతా చెప్పాను. ఆయన బాగా జాలిపడ్డాడు.

రెండు నెలలు గడిచాయి. ఒక రోజు తెల్లవారే సరికి అలివేలు ఇంట్లో లేదని అందరికీ తెలిసిపోయింది. ఆమె బట్టలు కూడా లేవు. తీరా చూస్తే పక్క మేడ మీది గదిలో ఆయన కూడా లేడనీ, రాత్రికి రాత్రే ఖాళీచేసి వెళ్ళిపోయాడనీ తెలిసింది. ఇద్దరూ కలిసి వెళ్ళిపోయారని మేమంతా అనుకున్నాము. అలివేలు ఆ నరకం నుంచి బయట పడినందుకు మేమంతా సంతోషించాము. కాని అలివేలు ఈ స్థితిలో ఇలా ప్లాటుఫారం మీద కనిపిస్తుందని అనుకోలేదు" అన్నా డతను బాధగా.

అలివేలు కథ వింటే నాకు మనసు బరువెక్కింది.

"బహుశాఅతను అలివేలును మోసం చేసిఉంటాడు" అన్నా డతను ఒక మారు అలివేలును చూసి.

ఎవ్వరమూ మాటాడలేదు.

"ఇంకా నాలుగయిదు రోజులకు మించి బతకదనిపిస్తోంది" మళ్ళీ అతనే అన్నాడు.

నాకు అలివేలుమీద అంతులేని జాలి కలిగింది.

"ఈమె తలి దండ్రులు ఎక్కడ ఉంటారో తెలుసా?" అడిగాడు నారాయణమూర్తి.

"తెలీదు" అన్నా డతను.

ఆమె లేచి కూర్చుని ప్లాట్‌ఫారం మీద ఆగి ఉన్న రైలును చూస్తోంది అప్పుడే అవతలి ప్లాట్ ఫారం మీదకు ఏదో రైలు రావడంతో అతను గబగబా వెళ్ళిపోయాడు. అతను వెళుతూండగా "ఈమె ఇక్కడ ఉన్నట్లు ఈమె భర్తతో చెప్పండి" అన్నాను.

అతను నవ్వి "ఆయన ఎప్పుడో ఇంకో పెళ్ళి చేసుకున్నాడు ..." అన్నాడు.

హౌరా ఎక్స్‌ప్రెస్ బయల్దేరుతున్నట్టు కూత వెయ్యటంతో నారాయణమూర్తి, నేను ఒక సారి ఆమె కేసి చూసి కదులుతున్న రైల్లో ఎక్కాము.

ఆ రాత్రి నాకు నిద్ర పట్టలేదు. ఎలాగయినా ఆమెను వాళ్ళ వూరి నుంచి తీసుకొచ్చిన ఆయనను పట్టుకోవాలి. ఆమెను చచ్చిపోనివ్వకుండా ఆయన దగ్గరకు చేర్చాలి అనుకున్నాను. కాని ఎలా? ఆయన్ను ఎలా తెలుసుకో గలగడం? ఎవరో ఒకరు ఈ వూర్లో ఆమె ఉన్నప్పుడు చూసి ఇప్పుడు గుర్తిస్తే తప్ప కనుక్కోవటం సాధ్యం కాదు.

మరో రెండ్రోజులు గడిచాయి.

అలివేలు మాత్రం ఆ బెంచీ మీద నుంచి లేవ లేదు. అలా వచ్చే పోయే వా రందరినీ నీరసంగా చూస్తూ పడుకుని ఉంది. ఆమె బాగా క్షీణించి పోయింది. కళ్ళు బాగా పీక్కుపోయి నిర్జీవంగా అగుపడుతున్నాయి.

ఒళ్ళంతా మట్టి కొట్టుకుని నల్లగా మచ్చలు మచ్చలుగా మారిపోయింది. పూర్తిగా మాసిపోయి రంగు వెలికుండా అయిపోయిన చీర, జాకెట్టు...

కనుల వెంట నీటి చారికలు. మొహం తెల్లగా పాలిపోయింది. కాళ్ళూ,చేతులూ తోటకూర కాడల్లా అయిపోయాయి. ఎండి పోయినవంకాయలా కాళ్ళూ, చేతులూ, తల అతికించినట్టుగా ఉన్నది ఆమె రూపం.

ఆమెను అలా పరీక్షగా చూసినప్పుడు నా హృదయంలో ఎంతో బాధ మెలి తిరిగింది.

పెళ్ళి కానప్పుడు ఆమె ఎన్ని బంగారు కలలు కన్నదో తన భావి జీవితం గురించి! భర్తతో సుఖపడాలనీ, సంతోషంగా జీవించాలనీ... ఇంకా ఎన్నెన్నో

రంగు రంగుల కలలు. చివరికి ఆమె జీవితం ఈ స్టేషన్ బెంచీకి, పూరు కాని పూళ్ళో అంకితం అయి పోతూంది.

ఏమిటీ జీవితం అనిపించింది.

అలివేలు గురించి నలుగురికీ చెప్పాలనీ, ఆమెను ఎలాగయినా మృత్యువు బారి నుంచి కాపాడాలనీ ఎంతో తాపత్రయం కలిగింది.

కాని నే నేం చెయ్యగలను? నా వల్ల ఏమవుతుంది?

మానవత్వమున్న ఒక మనిషిలా బాధ పడగలను. సానుభూతి చూపగలను.

నారాయణమూర్తి కూడా దాదాపు నా లాగానే ఫీలవుతున్నాడు. నాశన మవుతున్న ఆమె జీవితం పట్ల కొండంత జాలి. అక్కడ ఆమెకు జరిగిందేమిటి? ఆమె ఎందు కిలా మారిపోయింది? ఏదో పెద్ద షాకే తగిలి ఉండా లనిపించింది.

నా వూహ నిజమని ఆ మరు రోజు తెలిసింది. ఒంటి గంట దాటుతూ ఉండగా ఆరవ నంబరు ప్లాట్‌ఫారమ్ మీదకు అడుగు పెట్టిన మాకు ఆమె దగ్గరకు వెళ్ళి ఏవో ప్రశ్నలు వేస్తున్న ఒక యువకుడు కనిపించాడు. ఆమె ఏమీ మాట్లాడటం

ఇది బాలల సంవత్సరం. మీ బాలల భవిష్యత్తును గురించి ఆలోచించండి.

## మీ పిల్లవాడు ఎలా పెరుగుతున్నాడో
## మీ డబ్బుకూడా అలా పెరగవలసి ఉంటుంది.

### అలహాబాద్ బ్యాంక్, డబల్ డిపాజిట్ మరియు రెకరింగ్ డిపాజిట్ స్కీమ్‌లతో అది సాధ్యపడేలా చేస్తుంది.

పిల్లవాడు పెరుగుతున్నాడు అంటే. చదువు, ఆనందం, బహుమతులు ఇంకా ఎన్నో కావాలి. ఆ అవసరాలన్నింటికి మీరు ఎలా పొదుపు చేస్తారు? అలహాబాద్ బ్యాంక్ మీకు ఎన్నో విధాలుగా దారి చూపిస్తుంది...

డబల్ డిపాజిట్ స్కీమ్.

★ మీ డిపాజిట్ రెండు విధాలుగా పెరుగుతుంది. చాలా వడ్డీ వస్తుంది, ఎందుకంటే ప్రతి క్వార్టరు యొక్క వడ్డీ అసలు మొత్తానికి కలుపబడుతుంది. అందువలన రాబోయే క్వార్టరులో ఎక్కువ డబ్బుపై వడ్డీ కట్టబడుతుంది.

★ 8 సం॥లకు డిపాజిట్ చేసినట్లయితే అసలు మొత్తం రెండితలు అవుతుంది.

రెకరింగ్ డిపాజిట్ స్కీమ్

★ మీరు ప్రతినెలా డిపాజిట్ చేయడానికి రూ 10/- గాని వాటి గుణిజాలలో గాని ఎన్నుకోవచ్చును.


★ డిపాజిట్ కాలం 12 నెలల నుండి 120 నెలల వరకు ఉంటుంది.

★ మీరు డిపాజిట్ చేసిన దానికంటే 50 శాతం లేదా పైగా మీరు తిరిగి దానిని పొందవచ్చును.

గుర్తించుకొండి, బ్యాంక్ డిపాజిట్‌పైవచ్చే వడ్డీ సం॥ రూ 3000 దాక ఆదాయపు పన్ను నుండి మినహాయింపు మరియు బ్యాంక్ డిపాజిట్లు రూ 1,50,000 వరకు సంపద పన్ను నుండి మినహాయింపు. ప్రతి సం॥ ఆర్జించిన వడ్డీకి సర్టిఫికెట్ జారీ చేయబడుతుంది.

మీకు దగ్గరలోవున్న బ్రాంచిని వివరాలకొరకు దర్శించండి.

అలహాబాద్ బ్యాంక్
మీ స్వంత బ్యాంకు
(గవర్నమెంటు ఆఫ్ ఇండియావారి సంస్థ)



ULKA-AB-5 TEL

లేదు. అతను విసిగిపోయి అక్కడి నించి వచ్చేశాడు.

"ఆమె తెలుసా?" అతన్ని అడిగాను.

"నా కెందుకు తెలీదు. మా ఎదురింట్లో ఉండేది" అన్నాడు.

పోతున్న ప్రాణం తిరిగి వచ్చినంత సంతోషం కలిగింది.

"ఎడ్రసు చెప్పగలరా?" అడిగాను.

"ఎందుకు?"

"పనుంది. చెప్పండి."

"ఏం పని?"

ఇక లాభం లేదని నాకు ఆమె గురించి తెలిసిన కథ నంతా చెప్పి నేను ఏం చెయ్యదలుచుకున్నదీ చెప్పాను.

ఆ యువకుడు పెదవి విరిచి "మీరు వెళ్ళినా ఉపయోగం ఉండదు. ఈమెను తీసుకొచ్చి నాయన ఇక ఈమెను దగ్గరకు రానివ్వడు" అన్నాడు.

"ఎందుకు?" అడిగాడు నారాయణమూర్తి.

"ఎందు కేమిటీ? ఆ గదిలోకి వచ్చిన మూడు నెలలు రాగానే ఎటువంటి గొడవా లేకుండా ఉన్నారు. తరవాతనే గొడవ మొదలయింది. విషయం ఏమిటంటే, ఈమె ఆయన్ని తాళి కట్టమంటుందిట. అయన కట్టనంటాడు. దీని గురించి రోజూ నానా అల్లరి. ఆయన ఈమెను చచ్చేట్టు కొట్టేవాడు. దాదాపు ఇరవై రోజుల క్రితం ఒక రాత్రి ఆయన బాగా తాగి వచ్చాడు. ఒక్కడే రాలేదు. ఇంకో కంపెనీ దాన్ని గదికి తీసుకు వచ్చాడు. మళ్ళీ గొడవయింది. ఈమెను చావ కొట్టి గదిలో నించి బయటకు గెంటి సూట్కేసు, ఆమె బట్టలు, హ్యాండ్ బ్యాగ్ అన్నీ ఆమె మీదకు విసిరేశాడు. ఆమె బయట పడుతూ పెద్ద కేక పెట్టింది. అంతే! ఆ తర్వాత ఏడవలేదు. బట్ట లన్నీ సూట్‌కేసులో పెట్టుకుని, హ్యాండ్ బ్యాగ్ తీసుకుని అంత రాత్రి వేళ అక్కడినుంచి వెళ్ళిపోయింది. మే మంతా వాళ్ళ వూరు వెళ్ళిపోయిందనుకున్నాము. కాని తీరా ఇప్పుడు ఒక ఫ్రెండ్‌ను ట్రెయిను నెక్కించటానికి వస్తే ఇక్కడ కనిపించింది. పూర్ ఉమన్! ఎక్కడ పుట్టిందో! ఇక్కడ చావు రాసి పెట్టి ఉన్నది" అన్నా డా యువకుడు అదోలా మొహం పెట్టి ఆమె కేసి చూసి.

ఆమె చావు గురించి వినగానే నాలో మళ్ళీ ఒక విధమైన భయం కలిగింది.

నాకు బాగా దగ్గరయిన వ్యక్తి చావు గురించి మాట్లాడినట్టుగా అనిపించింది.

ఆ యువకుడు ఒక నిమిషం ఆమెను చూసి వెళ్ళిపోయాడు.

వెళ్ళబోయే ముందు 'అలివేలును తీసుకొచ్చి నాయన ఎడ్రసు తీసుకున్నాను.

వెంటనే మేము ట్రెయిన్ వచ్చినా ఎక్కకుండా స్టేషన్ బయటకు వచ్చాము.

వెంటనే ఆయన్ని కలుసుకోవాలి. ఆమెను చావు నించి తప్పించాలి.

పావుగంట తరవాత ఆయన ఉన్న గదిని చేరుకున్నాము.

ఆయనకు ఇంకా పెళ్ళి కాలేదుట ఎందువల్లనో.



ఫోటో— ఎం. శివశంకరయ్య (కర్నూలు)

తీరా లోపలికి వెళ్ళి చూస్తే గదికి తాళం పెట్టి ఉంది. పక్క పోర్షన్‌లో ఉంటున్న వాళ్ళను అడిగితే వూరికి వెళ్ళాడనీ, రాత్రికి రావచ్చుననీ చెప్పారు.

ఆయన పేరు సుందరంట.

ఉస్సూరుమంటూ వెనక్కు వచ్చాము.

ఆ రోజు రాత్రి కూడా నాకు నిద్ర పట్టలేదు. ఎలాగయినా ఆయనను ఒప్పించాలనీ, మళ్ళీ ఆయన అలివేలును తీసుకు వెళ్ళేట్టు చెయ్యాలనీ ఎంతగానో అనుకున్నాను. చెయ్యగలననే అనిపించింది. తృప్తిగా ఎప్పటికో నిద్ర పోయాను తెల్లవారుజామున.

పడుకున్నట్టే లేదు. మెలకువ వచ్చింది. లేచి చూస్తే అయిదున్నర అయింది. గబగబా రెడీ అయి బస్ డిపోకు వచ్చాను. అప్పటికే అక్కడ నారాయణమూర్తి ఉన్నాడు.

ఇద్దరం బస్సులో విజయవాడ వెళ్ళాము.

ఆయన గదికి వెళ్ళేసరికి ఏడు గంటలు దాటుతోంది. అప్పటికే గదికి తాళం పెట్టి ఎక్కడికో బయల్దేరా డాయన. పొట్టిగా, లావుగా ఉన్నాడు.

మమ్మల్ని పరిచయం చేసుకున్నాం.

"ఇంతకీ నాతో పనేమిటి?" అన్నా డాయన కనుబొమలు చిట్లించి.

చెప్పాను.

ఆ ఆయన ఆ విషయం విని షాక్ కొట్టినట్టు అయిపోయాడు. బహుశా ఆయన కూడా అలివేలు వాళ్ళ వూరు వెళ్ళిపోయి ఉంటుందనుకుని ఉంటాడు.

"మీ కేమిటి ఇంట్రెస్టు?" అన్నాడు తర్వాత.

"ఆమెను ఆ స్థితిలో చూసిన ఏ మనిషకయినా మనసు కరుగుతుంది" అన్నాను.

ఆయన మాట్లాడలేదు.

"ప్లీజ్, మాతో రండి" అన్నాను.

"నేను దానికోసం రాను. అది పిచ్చి ముండ. దాని సంగతి మీకు తెలీదు. అది పెద్ద క్రాక్" అన్నాడు మొండిగా.

"కావచ్చు. మీ పర్సనల్ మేటర్‌లో కలిగించుకుంటున్నందుకు క్షమించండి. మీరు ఆమెను ఇక్కడకు తీసుకు రావద్దు. ఎక్కడి నించి తీసుకు వచ్చారో అక్కడికి తీసుకెళ్ళి వదిలి రండి. అది న్యాయం. ముందు ఆమెకు మంచి ట్రీట్‌మెంటు కావాలి. ఆమె చనిపోయేట్లు ఉంది. ఆమెకు అలా జరిగిందంటే మీ మీదకు వస్తుంది" అన్నాను.

నా చివరి మాట ఆయన మీద బాగా పని చేసింది. మనిషి కొంచెం భయపడ్డాడు.

కొంచెంసేపు ఏదో ఆలోచించినట్టు మొహం పెట్టి తర్వాత "సరే, పదండి" అంటూ ముందుకు కదిలాడు.

"థాంక్స్" అన్నాను సంతోషంగా.

ముగ్గురం బయలుదేరాం.

స్టేషన్లోకి ప్రవేశించే సరికి ఎనిమిది గంటలు దాటుతోంది. ప్లాట్‌ఫారం బ్రిడ్జి మీదకు ఎక్కి గబగబా ఆరవ నంబరు ప్లాట్‌ఫారం మీదికి దిగాము.

హిగ్గిన్‌బాథమ్స్ స్టాల్ దాటగానే ఆమె ఉన్న బెంచీ కనిపించలేదు. ఆ బెంచీ చుట్టూ గుమికూడిన మనుషులు కనిపించారు.

నా గుండెలు అదిరాయి.

"మై గాడ్! నేను భయపడినంతా జరిగిందా?

వాళ్ళను తోసుకొని వెళ్ళి చూసేసరికి ఆమె చనిపోయి శవ రూపంలో కనిపించింది.

నా కళ్ళు తిరిగాయి. దుఃఖం పొంగి వచ్చింది.

ఆమె కళ్ళు, నోరు తెరుచుకుని ఉన్నాయి. ఈగలు నోట్లోకి వెళ్ళుతున్నాయి.

ఆమె ఆ బెంచీ మీదే వెల్లకింతలా పడుకుని ఉంది. తల క్రింద గుడ్డల మూట అలాగే ఉంది. ఆమె చెయ్యి హ్యాండ్‌బ్యాగ్‌ను పట్టుకుని ఉంది. బెంచీ క్రింద చెప్పులుమాత్రం లేవు.

ఆయనకేసి చూశాను. శిలలా నిలబడి ఆమెనే చూస్తున్నాడు. ఆయన చూపులో పశ్చాత్తాపం స్పష్టంగా కనిపిస్తోంది. నారాయణమూర్తి కేసి చూశాను. అతను నన్నే చూస్తున్నాడు. అతని కళ్ళ నిండుగా నీళ్ళు.

చుట్టూ ఉన్న మనుషులు రకరకాలుగా అనుకుంటున్నారు. ఆ మాటలు సరిగా వినిపించటం లేదు. ఆమెనే నా కళ్ళు చూస్తున్నాయి. ఆమె మసక మసగ్గా, అలుక్కుపోయినట్టుగా కనిపించింది.

ఆమె ఎవరో నాకు తెలీదు. మన ప్రాంతం కాదు. మన భాష కాదు. నాకు ఏమీ కాదు. అయినా ఆమె కూడా మనిషే అన్న భావన నన్ను నిలువునా కుంగదీసింది.

ఎక్కడ పుట్టిందో, ఎక్కడ పెరిగిందో, ముందు బ్రతుకు గురించి ఎన్నెన్ని కలలు కన్నదో! చివరికి ఇద్దరి మనుషుల దుర్మార్గానికి ఇక్కడ బలైపోయింది.

ఎవరి జీవితం ఎక్కడ అంతమయి పోతుందో ఎవరికి తెలుసు? నా గుండెలో చావు గురించిన భయం ఎన్నో వణికించేస్తోంది.